క్లుప్తంగా

గజపతినగరం సీఐగా ప్రభాకరరావు



సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎన్.వి.ప్రభాకరరావు

గజపతినగరం: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్.వి.ప్రభాకర రావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ సీఐగా పని చేసిన ఎల్.అప్పలనాయుడుకు అనకాపల్లి మండ లం కొత్తకోటకు బదిలీ అయ్యింది. ఆయన స్థానంలో మన్యం జిల్లా డీసీఆర్‌బీ నుంచి ప్రభాకరరావు బదిలీపై ఇక్కడికి వచ్చారు.

గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు



గరివిడి గ్రంథాలయానికి పుస్తకాల్ను అందజేస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు, ధీర ఫౌండేషన్ ప్రతినిధులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): నిరుద్యోగులు గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవసరమైన పుస్తకాలను ధీర ఫౌండేషన్ అధ్యక్షుడు బొత్స సందీప్ జిల్లాలోని గ్రంథాలయాలకు అందజేస్తున్నారని ఆఫౌండేషన్ సభ్యులు గంటా అప్పలరాజు, వినోద్, వికీ, రోహిత్ తెలిపారు. గరివిడి శాఖా గ్రంథాలయానికి ధీర ఫౌండేషన్ సంస్థ సమకూర్చిన పుస్తకాలను జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, గరివిడి మేజర్ పంచాయతీ వైస్ సర్పంచ్ బమ్మిడి కార్తీక్ లైబ్రేరియన్ ఎం.ఉషారాణికి ఆదివారం అందజేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

10వ తేదీ నుంచి మండల స్థాయి పోటీలు

దత్తిరాజేరు: 'ఆడుదాం- ఆంధ్రా' టోర్నమెంట్‌లో భాగంగా మండల స్థాయిలో ఈనెల 10వ తేదీ నుంచి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వి.కృష్ణాపురం వద్ద ఉన్న ప్రైవేటు లేఅవుట్‌లో క్రికెట్ పోటీలు, మరడాం ఉన్నత పాఠశాల మైదానంలో వాలీబాల్, ఖోఖో, షటిల్ బాడ్మింటన్, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జామి: జె.డి.వలస-అలమండ 11 కేవీ విద్యుత్ ఫీడర్‌లో మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఫీడర్ పరిధి గ్రామాలకు సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏఈ దేముడుబాబు ఆదివారం తెలిపారు. లొట్లపల్లి, జె.డి.వలస,అలమండ సంత, ఆర్.బి.పురం, కిర్ల, రామయ్యపాలెం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



ఒంటరి మహిళలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న డీటీ రమేష్, తదితరులు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామ పరిధిలోని ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 42 మంది ఒంటరి మహిళలకు 12 రకాల నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. అతిథిగా హాజరైన డిప్యూటీ తహసీల్దార్ తమటపు రమేష్ మాట్లాడుతూ ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినం దనీయమని, ట్రస్టుకు తనవంతు సాయం అందజేస్తానన్నారు. ఫర్ ది పీపుల్ ట్రస్ట్ చైర్మన్, వైస్ చైర్మన్ విశ్వనాథహరికుమార్, సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు ఈశ్వరప్పారావు. పి.రవి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న నాయకులు సన్యాసినాయుడు, శ్రీనివాసరావు

గుర్ల: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసి నాయుడు అన్నారు. మండలంలోని పాలవలసలో రూ.3 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు.అభివృద్ధితో సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. సర్పంచ్ పొట్నూ రు కనకమ్మ, మాజీ ఎంపీటీసీ బూర్లె శ్రీనివాసరావు, వైస్ సర్పంచ్ వల్లూరి రాము పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సందడి



జామి: పుష్పగిరిలో పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి



బొండపల్లి: కొవ్వాడపేటలో సద్గురు దేవానంద సరస్వతి ఆరాధన మహోత్సవాలకు హాజరైన భక్తులు



బొండపల్లి: కొవ్వాడపేటలో ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న విజయేంద్ర సరస్వతీ చంద్రశేఖర్ స్వామిజీ, వేదికపై నెల్లిమర్ల ఎమ్మెల్యే అప్పలనాయుడు



బొండపల్లి: కొవ్వాడపేటలో సద్గురు దేవానంద సరస్వతి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు



చీపురుపల్లి: కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేస్తున్న అర్చకులు



బొండపల్లి: దేవుపల్లి రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో పూజలు చేస్తున్న హరిత రహదారి చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సంజయ్



జామి: పుష్పగిరిలో గోదాదేవి అమ్మవారి పల్లకీ సేవ



జామి: జామిలో అయోధ్య అక్షతలు పంపిణీ చేస్తున్న సమరసతసేవా ఫౌండేషన్, హిందూ పరిషత్ సభ్యులు

జామి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పుష్పగిరి గ్రామంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు ఫణిహారం సీతారామాచార్యుల ఆధ్వర్యంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ పుష్పాలు, తులసీ దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే గోదాదేవి అమ్మ వారి పల్లకీసేవ నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి పంచామృతాభిషేకం

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో అర్చకులు అమ్మవారికి ఆదివారం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేకత కలిగిన రోజు కావడంతో ప్రతీ వారం పంచామృ తాభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నా రు.

ఆలయం వద్ద మధ్యాహ్నం దేవస్థానం కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో పూజలు

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీ దేవి అమ్మవారి ఆలయంలో అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులతో పాటు హరిత రహదారి చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సంజయ్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. సంజయ్ దంపతులతో అర్చకులు పూజలు చేయించారు.

అయోధ్య అక్షతల పంపిణీ

జామి: అయోధ్య రామమందిరం ప్రతిష్ఠ నేపథ్యంలో బాలరాముడిని పూజించిన అక్షతలను సమరసత సేవా ఫౌండేషన్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జామి ,భీమసింగి తదితర గ్రామాల్లో ఆదివారం పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్య రామజన్మభూమిలో రామమందిరం ప్రతిష్ఠోత్సవం నిర్వహించనున్నా రని, ప్రజలంతా ఆహ్వానితులేనని సమరసత సేవా ఫౌండేషన్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు తెలిపారు. అక్షతలతో పాటు ఆహ్వాన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. సమరసత సేవా ఫౌండేసన్ కన్వీనర్ మట్టా జనార్దన్, గౌరవ కన్వీనర్ బి.అప్పలరాజు, విశ్వహిందూ పరిషత్ జిల్లా కన్వీనర్ కె.నాగభూషణం, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

బొండపల్లి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని విజయేంద్ర సరస్వతీ చంద్రశేఖర్ స్వామిజీ అన్నారు. మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో దివ్య జీవన సంఘం విజయనగరం వారి ఆధ్వర్యంలో సద్గురు దేవానంద సరస్వతి 24వ ఆరాధన మహోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథి విజయేంద్ర సరస్వతీ చంద్రశేఖర్ స్వామిజీ ఆధ్యాత్మిక బోధన ప్రవచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారిలో దాగి ఉన్న ద్వేషం, అసూయ విడనాడాలని, అందరితో ప్రేమగా ఉంటూ సోదర భావం పెంపొందించుకోవాలని సూచించారు. ఆపదలో ఉన్నవారు శత్రువు అయినా సరే వారికి చేతనైన సాయం అందించా లని చెప్పారు. అంతకు ముందు భక్తులతో కలిసి సద్గురు దేవానంద చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు మారుపేరు సీఎం జగన్

- కొనసాగుతున్న వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు ఉత్సవాలు



కొత్తవలస: కొత్తవలసలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గోపమ్మ, తదితరులు



గజపతినగరం: పాతబగ్గాంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు



వేపాడ: అరిగిపాలెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న గ్రామపెద్ద సన్యాసిరావు, తదితరులు

కొత్తవలస: ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పింఛన్‌ను రూ.3వేలకు పెంచి విశ్వసనీయతకు మారుపేరుగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ అన్నారు. కొత్తవ లస మేజర్ పంచాయతీలోని 1,2,4 సచివాలయాల పరిధిలో నూతనంగా మంజూరైన, పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు సర్పంచ్ మచ్చా ఎర్రయ్యరామస్వామి ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో అవ్వా, తాతలు, వితం తువులు, దివ్యాంగులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.3 వేల పింఛన్ అందజేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం జగన్ దాదాపు నెరవేర్చారని, ఆయన్ని ప్రజలంతా ఆశీర్వదించాలని ఆమె కోరారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, మండల జేసీఎస్ ఇన్‌చార్జి బొంతల వెంకటరావు, ఎంపీటీసీ కొల్లి కృష్ణమూర్తి, మేజర్ పంచాయతీ వార్డు సభ్యులు కారుమూరి కృష్ణ, పూసర్ల రఘు, నాయకులు పల్లా భీష్మ, గొరపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

గజపతినగరం: పేద ప్రజల సంతోషమే ధ్యేయంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని, ఇచ్చిన మాటప్రకారం సామాజిక పింఛన్‌ను రూ.3 వేలకు పెంచారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు అన్నారు. పాతభగ్గాం, కొత్తభగ్గాం,గంగచోళ్ల పెంట గ్రామాల్లో సామాజిక పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ డబ్బులను ఆదివారం పంపిణీ చేశారు. పాతభగ్గాం గ్రామ పెద్ద లెంక చిన్నం నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన త్రినాథరావు, పప్పల గురునాయు డు,మంత్రి సూర్యం, బోని సంగమయ్య, కర్రి బంగారునాయుడు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

వేపాడ: పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండలంలోని అరిగిపాలెంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దుల్ల సన్యాసిరావు, కరకవలసలో వైస్ ఎంపీపీ ఈశ్వర రావు, నాయకులు డి.వి.రమణ, దుల్ల అప్పన్న తదితరులు సామాజిక పింఛన్లను లబ్ధిదారు లకు ఆదివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో సీఎం జగన్ అమలు చేస్తున్నారని అన్నారు.

శ్మశానవాటికల్లో బోర్ల ఏర్పాటు



శ్మశానవాటికలో బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామంలోని పెరికిలు శ్మశాన వాటికలో ఒక హ్యాండ్ బోరు,ఎస్సీ శ్మశానవాటికలో మరో బోరు డ్రిల్లింగ్ పనులను గ్రామ సర్పంచ్ తాళ్లపూడి కీర్తి ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు.15వ ఆర్థిక సంఘం నిధులతో ఒక బోరు, మండల పరిషత్ నిధులతో ఒక బోరు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తాళ్లపూడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దాబాలో 24 మద్యం సీసాలు స్వాధీనం

బొండపల్లి: బోడసింగిపేట గ్రామంలోని ఎస్.ఆర్ దాబాలో ఆదివారం నిర్వహించిన సోదాల్లో 24 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ ఎస్.రవి తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయాలు చేపడుతున్న దాబాయజమానిపై కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు. అలాగే గొట్లాం గ్రామంలోని ఓ మామిడితోటలో జూదం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ.17,360 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చురుగ్గా సీసీ రోడ్ల నిర్మాణం



రెల్లి వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు

గజపతినగరం: మండల కేంద్రంలోని బీసీ కాలనీ, దిగువ రెల్లి వీధిలో సీసీ రోడ్లు, కాలువల నిర్మా ణ పనులు చురుగ్గా సాగుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సర్పంచ్ నరవ కొండమ్మ ఆదివారం పూజలు చేసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులు రూ.2.50లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 లక్షలతో పనులు చేపడుతున్నామని సర్పంచ్ చెప్పారు. ఎంపీటీసీ కర్రి కళావతి, వైస్ సర్పంచ్ కర్రి రాము నాయుడు, సీనియర్ నాయకులు కర్రి నానాజీ, ఆల్తి రవికుమార్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

చీపురుపల్లి: లయన్స్‌క్లబ్, సాయి సూపర్ హాస్పిటల్ సంయుక్తంగా మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్, స్టార్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎస్.వి.జి.శ్రీనివాసరావు, సూరు దుర్గారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న లయన్స్‌క్లబ్ హాల్‌లో నిర్వహించే ఈ శిబిరంలో ఈఎన్‌టీ, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. చీపురుపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వసతి గృహం సందర్శన



వసతి గృహాన్ని సందర్శిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ అప్పారావు

గుర్ల: మండలంలోని కలవచర్ల బాలురు వసతి గృహాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు ఆదివారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. పదోతరగతి విద్యా ర్థులతో ఆయన మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలకు సమయం సమీపిస్తుండడంతో ప్రణాళికతో చదువుకోవాలని సూచించారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని వసతి గృహఅధికారిని ఆదేశించారు.

అరిగిపాలెంలో పారిశుద్ధ్యపనులు



పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

వేపాడ: మండలంలోని అరిగిపాలెంలో సర్పంచ్ దుల్ల లక్ష్మి ఆదివారం పారిశుద్ధ్య పనులు చేయించారు. ప్రధాన రహదారికి ఇరు వైపులా ఉన్న కాలువల్లో పూడిక,చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. కాలువల్లో, రోడ్లపై చెత్త పారబోయవద్దని, డస్ట్‌బిన్‌లలో వేసి ఇళ్ల వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని ప్రజలకు సర్పంచ్ సూచించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చీపురుపల్లి: జాతీయ యువజన వారోత్సవాలను పురస్కరించుకుని ఆశయ యూత్ అసోసియేషన్, నెహ్రూ యువ కేంద్రం సంయుక్తంగా స్థానిక సత్యరామ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్వామి వివేకానంద జీవిత చరిత్ర అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో 52 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవిత చరిత్రను ప్రతీ విద్యార్థి తెలుసుకోవాలన్నారు. పోటీల్లో విజేతలకు స్వామి వివేకానంద జయంతి రోజును బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఎన్.ఎస్.ఎస్ పీఓ ముకుంద రావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

దత్తిరాజేరు: ధాన్యం సేకరణకు సంబంధించి మిలర్లు రైతులకు ఇబ్బందులు పెట్టకూడదని ఆదేశించామని ఏఓ అనూరాధ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ఆరు రైస్ మిల్లులకే కాకుండా మండల సరిహద్దులోని మిల్లులకు కూడా రైతులు ధాన్యం తరలిస్తున్నారని పేర్కొన్నారు. మిల్లులకు ధాన్యం తరలించిన వారం రోజుల్లో నగదును రైతులు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ధాన్యం విక్రయించుకునే ప్రక్రియలో ఏమైనా సమస్యలు ఉంటే 83310 56311 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వేపాడ ఉన్నత పాఠశాల 1980-84 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

వేపాడ: స్థానిక ఉన్నత పాఠశాలలో 1980-1984 మధ్య ఆరోతరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కొండగుల్ల బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థులు అంతా పరస్పరం యోగ క్షేమా లు, పిల్లల చదువులు తదితర అంశాలను తెలుసుకున్నారు. పాఠశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకుని, ఆటపాటలతో సందడిగా గడిపారు. ఆత్మీయ సమ్మేళనం నిర్వాహకులు, పూర్వవిద్యార్థులు గుత్తి సూర్యారావు, ఎస్. ఈశ్వర రావు, దివాకర్‌ను మిగతా పూర్వవిద్యార్థులు అభినందించారు.

సుపథ ప్రతిభా పరీక్షలు



సుపథ ప్రతిభ పరీక్షలక హాజరైన విద్యార్థులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సుపథ స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలో విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. సుపథ వ్యవస్థాపకులు యు.వి.ఎ.ఎస్.రాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి సంస్కృత పండితులు వి.భాస్కరశర్మ, వి.కస్తూరి అతిథులుగా హాజరయ్యారు. పద్యపఠనం, శ్లోక పఠనం, వేద పఠనం, ఉక్త లేఖనం, శ్రీకృష్ణ చరితామృతం, దేశభక్తి గేయాలు, వ్యాస రచన అంశాల్లో 1వ తరగతి నుంచి 5 తరగతుల వారికి ప్రాథమిక స్థాయి, 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకూ ప్రాథమికోన్నత స్థాయి, 9,10 తరగతుల వారిని ఉన్నతస్థాయి అనే మూడు వర్గాలుగా విభజించి పోటీలు నిర్వహించారు. పోటీల్లో 15 పాఠశాలలకు చెందిన 441 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల అనంతరం విజేతలను ఎంపిక చేసి వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నిర్వాహకులు భోజన సౌకర్యం కల్పించారు.